క్లుప్తంగా

అశోక్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ గణితశాస్త్ర విభాగం పరిశోధకుడు పన్నీరు అశోక్‌కు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఏ స్టడీ ఆన్ రిలియబులిటీ ఆఫ్ మల్టీ కాంపోనెంట్ సిస్టమ్స్ ఫర్ స్ట్రెస్ – స్ట్రెంథ్ మోడల్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. ఆ విభాగం ప్రొఫెసర్ సుమతి ఉమామహేశ్వరి పర్యవేక్షణలో అశోక్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

మాలతికి లవ్లీ యూనివర్సిటీ డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ సైకాలజీ విభాగం పార్ట్‌టైం అధ్యాపకురాలు పుష్పాల మాలతికి పంజాబ్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఆ యూనివర్సిటీలో సైకాలజీ విభాగం పరిశోధకురాలుగా ఇంపాక్ట్ ఆఫ్ సెల్ఫ్ ఎఫికసీ, సెల్ఫ్ ఎస్టీమ్ అండ్ అచీవ్‌మెంట్ మోటివేషన్ ఆన్ ఎమోషనల్ ఇంటిలిజెన్స్ అమాంగ్ స్కూల్ టీచర్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి పంజాబ్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. డాక్టర్ జాహూర్ అహ్మద్‌లోన్ పర్యవేక్షణలో మాలతి తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

హన్మకొండ: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రముఖ యోగా గురువు పోశాల శ్రీనివాస్ తెలిపారు. హనుమకొండ నక్కలగుట్టలోని పర్యాటక అభివృద్ధి సంస్థ, హనుమకొండ జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మూడేళ్లగా నిరంతరం నక్కలగుట్టలోని హరిత కాకతీయలో యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ యోగా గురువు పోశాల శ్రీనివాస్ వివరించారు. వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకొని ఈనెల 8 నుంచి నూతన బ్యాచ్‌ను ప్రారంభిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం 6గంటల నుంచి 7గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 93947 66001 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

25నుంచి బ్యాడ్మింటన్ పోటీలు

హసన్‌పర్తి: ఈనెల 25నుంచి రెండు రోజుల పాటు జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయని డబ్ల్యూడీబీఏ అధ్యక్షుడు డాక్టర్ రమేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రమేష్‌రెడ్డి ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. కిట్స్ కళాశాల వేదికగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో బాలబాలికలతో పాటు పురుషులు, మహిళలకు పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈనెల 20వ తేదీలోపు ఎంట్రీలు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. వివరాలకు 94405 99888, 98480 27755, నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

అనారోగ్యంతో క్రీడాకారుడి మృతి



ప్రతాప్‌సింగ్ (ఫైల్)

కాజీపేట: కాజీపేట పట్టణానికి చెందిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ క్రీడాకారుడు ఠాకూర్ ప్రతాప్ సింగ్ (65) అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆస్పత్రిలో శనివారం సాయంత్రం మృతి చెందారు. ఖిలా వరంగల్ కోటలో పుట్టి పెరిగిన ప్రతాప్.. చిన్నప్పటి నుంచే వాలీబాల్ క్రీడలో బాగా రాణించేవాడు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని అనేక అవార్డులు, ట్రోఫీలను కైవసం చేసుకున్నాడు. నాలుగు దశాబ్దాలుగా కాజీపేట పట్టణంలో స్థిరపడిన ప్రతాప్.. వారసత్వంగా వచ్చిన ఆయుర్వేద మొక్కలతో చిన్న పిల్లలకు వైద్యం చేయడంలో దిట్టగా పేరొందారు. కాగా, ప్రతాప్ మృతికి పలువురు సంతాపం ప్రకటించారు.

మూడ్రోజులు రైల్వే గేట్ మూసివేత

కాజీపేట: కాజీపేట రైల్వేస్టేషన్ పరిధి వడ్డేపల్లి వద్ద ఉన్న గేట్ నంబర్–1ఈ సమీపంలో ఆర్‌ఓబీ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈనెల 8వ తేదీ నుంచి 10 వరకు గేటు మూసి వేస్తున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. వాహనదారులు, బాటసారులు ప్రత్యామ్నాయ రహదారుల్లో ప్రయాణం చేయాలని కోరారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



కరీమాబాద్: ప్రస్తుల పరిస్థితుల్లో ప్రతీఒక్కరు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రంగశాయిపేట యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి.భార్గవి సూచించారు. 43వ డివిజన్ జక్కలొద్దిలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ భార్గవి మాట్లాడుతూ చిన్న జబ్బులను కూడా నిర్లక్ష్యం చేయకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఏఎన్‌ఎం జయమణి, బీటీబీ సీసీ రాధిక, రమేష్, ఆశ కార్యకర్త జయ, అంబేడ్కర్ యూత్ అధ్యక్షుడు మైదం కిరణ్‌కుమార్, రాజు, మస్తాన్, శేఖర్, నిర్మల, సునంద, మంజుల, శోభ, రేణుక పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి



కేయూలో పరిపాలన భవనం వద్ద ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు



ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వద్ద ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లందరిని రెగ్యులరైజ్ చేయాలని కాంట్రాక్టు లెక్చరర్లు డిమాండ్ చేశారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీలోని పరిపాలన భవనం వద్ద శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా కేయూ కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 12యూనివర్సిటీల్లోని 1,335మంది కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు డాక్టర్ మధుకర్‌రావు, డాక్టర్ చీకటి శ్రీనివాస్, బాధ్యులు మంజుల, కిషన్, సంగీత్‌కుమార్, బ్రహ్మయ్య, సుచిరితపాల్, భాగ్య, సుజాత, వీణ, విజయకుమార్, అనిల్‌కుమార్, శశిధర్, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల వద్ద ధర్నా

కేయూ క్యాంపస్: యూనివర్సిటీల్లోని కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వద్ద కాంట్రాక్ట్ అధ్యాపకులు శనివారం ధర్నా చేశారు. తమను క్రమబద్ధీకరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్ బాధ్యులు చిర్రరాజు, మామిడి లింగయ్య, కనకయ్య, నాగయ్య, ప్రవీణ్, ఆదిరెడ్డి, శ్రీనివాస్, సునీత, జూల సత్యం, సురేష్, కొమురయ్య, రమేష్, చందులాల్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ పరికరాలతో విధులు నిర్వహించాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

హసన్‌పర్తి: రక్షణ పరికణాల ఉపయోగించి విధులు నిర్వహించాలని విద్యుత్ సిబ్బందికి హనుమకొండ రూరల్ డివిజన్ డీఈఈ సామ్యానాయక్ సూచించారు. విద్యుత్ భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని చింతగట్టు సబ్‌సబ్‌స్టేషన్‌లో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరిత్యాల కారణంగా తీగలు తెగిపోవడం, స్తంభాలు విరిగిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అలాంటి సమయాల్లో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాల నుంచి రక్షణకు భద్రత సూచనలు పాటించాలని సూచించారు. వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా వారోత్సవాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ గంగారెడ్డి, ఏఈలు ప్రదీప్‌కుమార్, తరుణ్‌కుమార్, మంగమ్మ, లైన్ ఇన్‌స్పెక్టర్ గోవర్ధన్, రౌతు రమేష్‌కుమార్, లైన్‌మెన్లు రాజేందర్, రాజ్‌కుమార్, చంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కబ్జాలకు తెగిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



బాధితురాలి స్థలంలో నిర్మించిన జెండా గద్దె



వివరాలు వెల్లడిస్తున్న బాధితురాలు

● బీజేపీ నాయకులు సతీష్, వెంకటరమణ

దేశాయిపేట: నగరంలోని ఖాళీగా ఉన్న స్థలాలతో పాటు ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసే పనిలో బీఆర్‌ఎస్ నాయకులు తలామునకలయ్యారని బీజేపీ తూర్పు నాయకులు కుసుమ సతీష్, వన్నాల వెంకటరమణ ఆరోపించారు. ఎంహెచ్‌నగర్‌లో దామెర మైహబూబీ ఆధీనంలో 15ఏళ్లుగా ఉన్న స్థలంలో బీఆర్‌ఎస్ జెండా గద్దెను నిర్మించారు. దాంతో బాధితురాలును బీజేపీ నాయకులు శనివారం పరామర్శించి ఆమెకు మద్దతుగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ గద్దె కోసం పేదరాలి స్థలాన్ని కాజేయడం దారుణమని విమర్శించారు. కార్యక్రమంలో మహిళా మోర్చా నాయకురాలు పిట్ట సరస్వతి, కొత్తకొండ రాజు, వి.తిరుపతి, ప్రవీణ్, మంతెన అనిత, దేవిక, సదానందం, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

దసరాకు ముదిరాజ్ కమ్యూనిటీ హాల్



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న బండా ప్రకాశ్

కాజీపేట అర్బన్: దసరా పండుగ రోజున ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ భవనాన్ని ప్రారంభించుకుందామని, ఈక్రమంలో నిర్మాణ పనులను నాణ్యతతో పాటు త్వరితగతిన పూర్తి చేయాలని శాసన మండలి డిప్యూటీ చైర్మన్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బండా ప్రకాశ్ తెలిపారు. కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలో రూ.55 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ఆయన శనివారం రాత్రి పరిశీలించి కాంట్రాక్టర్, అధికారులకు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ ముదిరాజ్, అర్బన్ అధ్యక్షుడు బయ్య స్వామి, ప్రధాన కార్యదర్శి పులి రజినీకాంత్, మాజీ ఎంపీటీసీ సాధినేని సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

న్యూశాయంపేటలో లైవ్‌ఫిష్ స్టాల్ ప్రారంభం

హంటర్‌రోడ్డు న్యూశాయంపేటలో లైవ్‌ఫిష్ స్టాల్‌ను బండా ప్రకాశ్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ నాయకులు, ఫిష్‌స్టాల్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ చర్యల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

కేయూ క్యాంపస్: కేయూలో వీసీ, రిజిస్ట్రార్లు వర్సిటీ అధ్యాపకులపై వ్యక్తిగత కక్షలకు పాల్పడుతున్నారని, ఇద్దరు అధ్యాపకులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడాన్ని కేయూ అధ్యాపకుల సంఘం అకుట్ ఖండిస్తుందని శనివారం ఆ సంఘం అధ్యక్షుడు ఆచార్య టి.శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో విభాగాధిపతి అయిలయ్యను అదే విభాగం ఆచార్యులు తాటికొండ రమేశ్ వీసీగా నియామకం కాగానే.. అయిలయ్యను ఖమ్మం పీజీ సెంటర్ కళాశాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారని పేర్కొన్నారు. హనుమకొండ ఆర్ట్స్ కళాశాలలో సోషియాలజీ విభాగాధిపతిగా కొనసాగిస్తూ అక్కడ విధులను ఎలా కొనసాగిస్తారని వారు ప్రశ్నించారు. దీని వెనుక వ్యక్తిగతంగా కుట్రలు దాగున్నాయన్నారు. ఆతర్వాత అతడిపై విచారణ జరిపించి ఇప్పుడు ఆ ప్రొఫెసర్ అయిలయ్యపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం శోచనీయమన్నారు. అలాగే.. ఆర్ట్స్ కళాశాలలో ఓమహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై కూడా క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారన్నారు. ఆఇద్దరిపై తీసుకున్న క్రమశిక్షణ చర్యల నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం కేయూ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందించారు.

‘చీఫ్ విప్ వినయ్‌కు ఓటమి భయం’

నయీంనగర్: శుక్రవారం మంత్రి కేటీఆర్ పాల్గొన్న బీఆర్‌ఎస్ సభ అట్టర్ ఫ్లాప్ అయ్యిందని ఈ సభతో బీఆర్‌ఎస్ పతారా పాతర అయిందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేశ్‌రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ హరిత హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ సభలో కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచారం చేశారన్నారు. ప్రధాని మోదీని తిట్టే స్థాయి కేటీఆర్‌ది కాదని మోదీని తిడితే కేటీఆర్‌కు గుండు కొట్టిస్తామన్నారు. ప్రధాని మోడీ 15 లక్షలు ఖాతాల్లో వేస్తానన్నట్లు ఆధారాలు చూపితే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానన్నారు. చీఫ్ విప్ వినయ్ భాస్కర్‌కు ఓటమి భయం పట్టుకుందని అందుకే టికెట్ కోసం కేటీఆర్‌కు వంగి వంగి దండాలు పెడుతున్నాడన్నారు. ఎన్నికల్లో గెలవాలంటే రామన్న ఆశీర్వాదం కన్నా హన్మకొండ ఓటర్ల ఆశీర్వాదం కావాలన్నారు. గ్రేటర్‌లో జరుగుతున్న 90 శాతం అభివృద్ధి పనులు కేంద్ర ప్రభుత్వ స్మార్ట్ సిటీ, హృదయ్ నిధులతోనే పూర్తి చేశారన్నారు. సీఎం కేసీఆర్‌కు వరంగల్ అభివృద్ధి ఇష్టం లేదని, అందుకే కాజీపేట రైల్వే ఓవరాల్ యూనిట్‌కు 10 ఎకరాలు ఇవ్వడం లేదన్నారు.

నేత్రదానంతో ఇద్దరు అంధులకు చూపు



నివాళులర్పిస్తున్న నేత్ర, అవయవ దాన అసోసియేషన్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు

హన్మకొండ: నేత్రదానంతో ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించవచ్చని తెలంగాణ నేత్ర అవయవ, శరీర దాతల అసోసియేషన్ అధ్యక్షుడు కొర్నెడ్డి మల్లారెడ్డి అన్నారు. తెలంగాణ నేత్ర అవయవ, శరీర దాతల అసోసియేషన్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హనుమకొండ వికాస్‌నగర్‌లో నేత్ర దానం చేసిన మృతురాలు పిన్నింటి కమల సంస్మరణ సభ శనివారం జరిగింది. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ అవయవ దానం చేయడం ద్వారా 8 మందికి ప్రాణదానం చేయవచ్చని వివరించారు. నేత్రదానం, అవయవ దానానికి 87905 48706, 97037 38699 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో బంధుమిత్రులు మోహన్ రెడ్డి, బుచ్చిరెడ్డి, బండ నారాయణరెడ్డి, తెలంగాణ నేత్ర, శరీర దాతల అసోసియేషన్ లయన్స్ క్లబ్ ప్రతినిధులు బండ సాయిరెడ్డి, ఉపేందర్ రెడ్డి, శంకర్ యాదవ్, డాక్టర్ రాజేంద్రప్రసాద్, కేదారి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిబ్బందికి కూలింగ్ గ్లాస్‌ల అందజేత



ట్రాఫిక్ సిబ్బందికి కూలింగ్ గ్లాసులు అందజేస్తున్న సీపీ రంగనాథ్

వరంగల్ క్రైం: వరంగల్ ట్రైసిటీ ట్రాఫిక్ సిబ్బందికి వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ చేతుల మీదుగా కూలింగ్ గ్లాస్‌లు పంపిణీ చేశారు. ముందుటెండలో రోడ్లపై విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తమవంతుగా సహకారం అందించాలనే లక్ష్యంతో మాజీ శాప్ డైరెక్టర్ రాజనాల శ్రీహరి.. సీపీ చేతుల మీదుగా కూలింగ్ గ్లాస్‌లు అందించారు. ఈసందర్భంగా సీపీ ఏవీ రంగనాథ్ మాట్లాడుతూ.. ఎండలో విధులు నిర్వహించే సిబ్బంది తగు జాగ్రత్తలు పాటించి ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ మధుసూధన్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు బాబులాల్, రవికుమార్, రామకృష్ణ, ట్రాఫిక్ శిక్షణ కేంద్రం ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, ఎస్సైలు రాజేశ్, నవీన్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు శోభన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గారు.. మా తమ్ముడిని ఆదుకోరూ!



మంచానికే పరిమితమైన బాధితుడు వినోద్

కాశిబుగ్గ: వరంగల్ 19వ డివిజన్ వివేకానందకాలనీకి చెందిన సిరివెల్ల వినోద్.. గత నెలలో నగరంలోని ఓ ఫంక్షన్ వెళ్లి వస్తుండగా కొందరు దుండగులు అతడిపై దాడి చేసి రెండు కాళ్లు, ఓ చెయ్యి విరగగొట్టి చనిపోయిండనుకొని వదిలేసి వెళ్లిపోయారు. ఈ ఘటనలో బాధితుడు వినోద్‌ను అన్న హరిప్రసాద్ ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించుకుని ఇంటికి తీసుకువచ్చాడు. అయితే, బాధితుడి రెండు కాళ్లు, చెయ్యి పనిచేయక జీవచ్ఛవంలా మంచానికే పరిమితమయ్యాడని, అతన్ని ఆదుకోవాలంటూ బాధితుడి అన్న హరిప్రసాద్ సామాజిక మాధ్యమాల్లో కోరుతున్నాడు. ఈమేరకు వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ తమ ఇంటికి వచ్చి తమ్ముడు వినోద్‌ను పరామర్శించి ఆదుకోవాలని హరిప్రసాద్ కోరుతున్నాడు.

విలువలతో కూడిన విద్యనందించాలి



మాట్లాడుతున్న విద్యాసాగర్‌రెడ్డి

హసన్‌పర్తి: విద్యార్థులకు నైతిక, మానవీయ విలువలతో కూడిన విద్యనందించాలని మల్టీపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ ఎం.విద్యాసాగర్‌రెడ్డి సూచించారు. లయన్స్ క్లబ్, వరంగల్ ఆధ్వర్యంలో ‘స్కిల్స్ ఫర్ యాక్షన్’ అనే అంశంపై రెండు రోజుల పాటు కొనసాగనున్న ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమం నగరంలోని కిట్స్ కళాశాలలో శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైపుణ్యాలు పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 50ఏళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కన్న పరశురాములు, కిట్స్ కళాశాల కోశాధికారి నారాయణరెడ్డి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు రేణుక, రమ, ప్రొఫెసర్ సతీష్‌చంద్ర, డాక్టర్ భార్గవి, ప్రొఫెసర్ ప్రభాకరాచారి పాల్గొన్నారు.

ఉద్యోగుల స్థలాలు కాపాడండి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

కాజీపేట: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు కేటాయించిన స్థలాలను కాపాడాలని ఉద్యోగ సంఘాల నాయకులు కోరారు. ఈమేరకు హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు ఉద్యోగ సంఘాల నాయకులు శనివారం వినతి పత్రం అందజేశారు. కడిపికొండ గ్రామశివారులో ఉద్యోగుల స్థలాలు కబ్జాకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. 32ఎకరాల స్థలంలో కొంతమంది కబ్జాదారులు ఆక్రమణలకు పాల్పడుతూ ఇంటి నిర్మాణ పనులు చేపడుతున్నారని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, పనికెల రాజేష్, శనిగరపు శ్యామ్ సుందర్, రాజేష్ ఖన్నా, చీకటి శ్రీనివాస్, రామ్ ప్రసాద్, భరత్, ప్రణయ్, పైడిరాజు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ షీబారాణి

వరంగల్: నగరంలోని 3వ డివిజన్ పైడిపల్లిలోని మహిళలకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణ శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ జన్ను షీబారాణి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు స్వయం ఉపాధి అవకాశాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వేసవి శిక్షణ శిబిరంలో సుమారు 60మంది మహిళలకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జన్ను మమత, కీర్తన, జన్ను నీలిమ, మౌనిక, సృజన, సునీత, రాజేశ్వరి, వెన్నెల, ప్రవంతి, అక్షర తదితరులు పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్లు లేకుంటే జరిమానా

కాజీపేట: ప్రతీద్విచక్ర వాహనానికి ముందు, వెనుక నంబర్ ప్లేట్లు తప్పనిసరిగా ఉండాలని ట్రాఫిక్ సీఐ కె.రామకృష్ణ హెచ్చరించారు. వాహనాల నంబర్ ప్లేట్లపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న పలు వాహనాలను కాజీపేట చౌరస్తాలో అదుపులోకి తీసుకుని వాహనదారులకు ఈ – చలాన్ ద్వారా వెంటనే జరిమానా విధించడంతో పాటు అన్ని వాహనాలకు క్షేత్ర స్థాయిలోనే నంబర్ ప్లేట్లను పెట్టించారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్

మామునూరు: నాణ్యతా ప్రమాణాలు పాటించి విలీన గ్రామాల్లో రోడ్డు నిర్మించాలని స్థానిక కార్పొరేటర్ గద్దె బాబు కాంట్రాక్టర్ సూచించారు. వరంగల్ 17వ డివిజన్ ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట నుంచి రామకృష్ణాపురం వరకు నిర్మిస్తున్న రోడ్డు పనులను అధికారులతో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ తుమ్మ రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు బొజ్జం సుధాకర్, సుతారి శ్రీధర్, సోల్తీ నరేందర్, సదువాల యాకూబ్, ఇల్లందుల శ్రీను, బొజ్జం భరత్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ నగర సంకీర్తన



కాశిబుగ్గ: కాశిబుగ్గలో హనుమాన్ మాలధారుల ఆధ్వర్యంలో హనుమాన్ నగర సంకీర్తన శనివారం వైభవంగా జరిగింది. రంగనాథస్వామి ఆలయం నుంచి ప్రత్యేక వాహనంపై ప్రారంభమైన సంకీర్తన.. మాలధారుల భజనలు, నృత్యాలు మధ్య కాశిబుగ్గ వీధుల్లో కొనసాగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వంగరి రవి, కార్యదర్శి సురేష్, కోశాధికారి సుల్తానా సమ్మక్క, అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, భాస్కర్, రవికుమార్, మల్లేషం, సమ్మయ్య పాల్గొన్నారు.

వరంగల్ జిల్లా మలుపు సొసైటీ ఏర్పాటు



వరంగల్ జిల్లా మలుపు సొసైటీ నూతన కార్యవర్గం

వరంగల్: నగరంలోని మండిబజార్‌లోని మలుపు కార్యాలయంలో వరంగల్ జిల్లా మలుపు సొసైటీ నూతన కార్యవర్గాన్ని సొసైటీ రాష్ట్ర ప్రతినిధి, మాజీ కార్పొరేటర్ జన్ను ఆహరో అధ్యక్షతన శనివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో లేట్ క్యాప్ సంస్థ ద్వారా 400 మంది తోళ్ల పరిశ్రమల వృత్తి నైపుణ్యాలపై మద్రాస్ వరంగల్ పట్టణాల్లో వృత్తి శిక్షణను పూర్తి చేసినట్లు తెలిపారు. ఉపాధి లేక వారు వివిధ పనుల్లో పనిచేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా వారిని పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడానికి కృషి చేసేందుకు నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షుడిగా జన్ను కోర్నేలు, ఉపాధ్యక్షుడిగా జన్ను లక్ష్మణ్, కార్యదర్శిగా దామెర సారయ్య, సహాయ కార్యదర్శిగా పోగుల సృజన్, కోశాధికారిగా దండు చక్రపాణి, కార్యవర్గ సభ్యులుగా జన్ను ఎల్లయ్య, చింతరాజు, సామర్ల కిరణ్, గణపతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వేసవి క్రీడలను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కాజీపేట: కాజీపేట రైల్వే ఉన్నత పాఠశాల ఆవరణలో ఉచిత వేసవి క్రీడాశిక్షణ శిబిరాలను విజయవంతం చేయాలని రైల్వే కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈమేరకు సంబంధిత వాల్‌పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈనెల 9వ తేదీ నుంచి 28వరకు బాలబాలికలకు ఉచిత కరాటే శిక్షణ ఇవ్వనున్నట్లు కోచ్ నాయిని సదానందం ప్రకటించారు. కార్యక్రమంలో రైల్వే మజ్దూర్ యూనియన్ జోనల్ ప్రెసిడెంట్ కాల్వ శ్రీనివాస్, ఇన్‌స్టిట్యూట్ కార్యదర్శి దేవులపల్లి రాఘవేందర్, దీపక్ సాయి, ఎం.రాజయ్య, బి.మాధవరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

